## క్లుప్తంగా

### 25 నుంచి శివరాత్రి ఉత్సవాలు


మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని మూలాపేటలో ఉన్న స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద స్వర్ణలింగేశ్వరుని దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి ఘనంగా జరుగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల ఆహ్వాన పత్రికలను వారు దేవస్థానంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, కార్యదర్శి పి.సురేందర్ రెడ్డి, ముక్కాల వ్యాసప్రసాద్, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లిక, కోడూరు జయప్రద మాట్లాడారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విశేషంగా ఉత్సవాలు జరుగనున్నాయని వివరించారు. భక్తులు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో కామేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుజాత, మహాలక్ష్మి, శ్రీనివాసులు, హర్షవర్ధన్, కుమార్ పాల్గొన్నారు.

### నేదురుమల్లికి ఘన నివాళి


పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : మాజీ ముఖ్యమంత్రి దివంగత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని నగరంలోని ఇందిరాభవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ బాబు, అల్లావుద్దీన్, శ్రీనివాసులు, గణేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

### సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ, డీఆర్వో

నెల్లూరురూరల్ : రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ ఎస్సార్ శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై చర్చించారు. డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 52వ దఫా రక్తదానం


రక్తదానం చేస్తున్న రాజేంద్రప్రసాద్

నెల్లూరు(అర్బన్) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్ 52వ దఫా రక్తదానం చేశారు. స్థానిక మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో గురువారం ఆయన రక్తదానం చేసి మాట్లాడారు. తాను క్రమం తప్పకుండా ప్రతి మూడు నెలలకు ఒక దఫా రక్తదానం చేయాలని నిర్ణయించుకుని ముందుకు సాగుతున్నానన్నారు. ఎంసీ మెంబర్ మలిరెడ్డి కోటారెడ్డి, న్యాయవాదులు రామకృష్ణ, కేశవులు, నిరంజన్ రవికుమార్ పాల్గొన్నారు.

### కాకాణితో బుర్రా సమావేశం


కాకాణితో మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్‌యాదవ్

నెల్లూరు(బారకాసు) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని స్థానిక డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

### విద్యుత్ మీటర్‌కు మాత్రమే నగదు చెల్లించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి విద్యుత్ మీటర్‌కు మాత్రమే నగదు చెల్లించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్ అన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ లైన్లు లేకుండా ఉన్న స్తంభాలు


విద్యుత్ స్తంభాలకు దుస్తులను ఆరేసిన వైనం


నిరుపయోగంగా వదిలేసిన నూతన స్తంభాలు


# కరెంట్ కష్టాలకు చెక్ పడేనా?

- త్రీఫేజ్ మంజూరైనా ఏర్పాటులో అలక్ష్యం
- నిరుపయోగంగా విద్యుత్ స్తంభాలు
- వేసవి సమీపిస్తుండడంతో హడలిపోతున్న ప్రజలు

**వేసవి వస్తే తమకు కరెంట్ కష్టాలు తప్పవని ఆ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వేసవిలో కరెంట్ సరఫరాలో అంతరాయాలు, లో-ఓల్టేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దీనిని పరిష్కరించేందుకు చేపట్టిన పనులు కూడా సగంలోనే ఆగిపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజనకాలనీ, పునరావాస కాలనీ, నల్లకాలువ, డెయిరీ ప్రాంతం, జనార్దరెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీ, టిడ్కో గృహ సముదాయం, జగనన్న కాలనీలు ఉన్నాయి. ఇందులో మొత్తం 13 వేల వరకు విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. వీటిలో 53వ డివిజన్ పరిధిలో నాలుగు వేల సర్వీసులు ఉండగా, 54వ డివిజన్‌లో అత్యధికంగా 9 వేలకు పైగా సర్వీసులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతవాసులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలన్న ఉద్దేశంతో జనార్దనరెడ్డికాలనీలో ఉన్న సబ్‌స్టేషన్‌ను విద్యుత్ సెక్షన్ కార్యాలయంగా ఏర్పాటు చేశారు. అయినా ఫలితం మాత్రం ఉండడం లేదు.

**తరచూ అంతరాయాలు**

ఇక్కడి ప్రజలకు వేసవి కాలంలో తరచూ విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. గత వేసవిలో భగత్‌సింగ్‌కాలనీలో లో-ఓల్టేజీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనలు సైతం చేశారు. దీంతో అదనపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్లను వేయాలని, సింగిల్ ఫేజ్ సరఫరా ఉన్న ప్రాంతాల్లో త్రీఫేజ్ సరఫరా చేయాలని, డ్యామేజీ స్తంభాల స్థానంలో కొత్త వాటిని వేయాలని సంబంధిత అధికారులు భావించారు.

**నిరుపయోగంగా..**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదనపు విద్యుత్ స్తంభాలను కూడా మంజూరు చేశారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను కూడా వేశారు. కానీ ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయకపోవడం, త్రీఫేజ్ విద్యుత్ లైన్లు వేయకపోవడం, ప్రమాదభరితంగా ఉన్న స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు లాంటి పనులు చేపట్టలేదు. నూతన విద్యుత్ లైన్ల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు కండక్టర్ (లైన్లు) వేయకపోవడంతో ఇవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి మార్చకపోవడంతో నూతన స్తంభాలు రోడ్డు పక్కన నిరుపయోగంగా పడి ఉన్నాయి.

**రాత్రి వేళల్లో..**

వెంకటేశ్వరపురం విద్యుత్ సెక్షన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారే కానీ, రాత్రి సమయాల్లో సిబ్బందికి విధులు వేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు పోయినా, లో-ఓల్టేజీ సమస్య వచ్చినా, విద్యుత్ లైన్లు తెగిపడినా, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన సమయాల్లో సరఫరా పునరుద్ధరణకు తీవ్ర జాప్యం కలుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. నగరంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు, సెక్షన్ కార్యాలయాల పరిధిలో రాత్రి వేళల్లో సరఫరాలో అవాంతరాలు ఏర్పడితే సత్వరమే పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఈ సెక్షన్ కార్యాలయంలో మాత్రం నైట్ డ్యూటీలు లేకపోవడంతో సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పునరుద్ధరణ చర్యల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది.

**లో-ఓల్టేజీ సమస్యతో అల్లాడుతున్నాం**



భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో కొన్నిచోట్ల సింగిల్ ఫేజ్ విద్యుత్ మాత్రమే ఉంది. వేసవిలో ప్రజలు ఏసీ, ఫ్యాన్లు ఎక్కువగా వినియోగిస్తుండడంతో లో-ఓల్టేజీ వస్తోంది. ప్రతి వేసవిలో ఈ సమస్య ఉంటోంది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.
– ఎల్వీకే స్వామి, భగత్‌సింగ్ కాలనీ

**స్తంభాలు వేశారు.. లైన్లు లాగలేదు**



భగత్‌సింగ్‌కాలనీలో కొత్తగా విద్యుత్ స్తంభాలు వేశారు. అయితే ఇప్పటివరకు వాటికి వైర్లు లాగలేదు. చాలా ఏళ్లుగా వేసవికాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటున్నాయి. అయితే శాశ్వత పరిష్కారం మాత్రం చూపలేకపోయారు.
– లక్ష్మణ్‌రావు, భగత్‌సింగ్ కాలనీ

**కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి**



గత కొన్ని సంవత్సరాలుగా వేసవిలో మాకు విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. రాత్రి వేళల్లో కరెంట్ పోతే ఉక్కపోత, దోమల బెడదతో గడిపిన క్షణాలను మరచిపోలేకపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు అంతరాయాలు లేని కరెంట్ ఇవ్వాలని కోరుకుంటున్నా.
– బాషా, జనార్దనరెడ్డికాలనీ

**సమస్యలు లేకుండా చూస్తాం**



భగత్‌సింగ్‌కాలనీ, జనార్దనరెడ్డి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు, లో-ఓల్టేజీ సమస్యలు ఉన్నది వాస్తవమే. దీనిని అధిగమించేందుకు అదనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశాం. అయితే లైన్లు వేసేందుకు కొంత ఆలస్యమైంది. వెంటనే నూతన స్తంభాలకు లైన్లు లాగి నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు, రాత్రి వేళల్లో వినియోగదారులకు ఇబ్బందుల్లేకుండా నైట్ డ్యూటీలు వేసేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీధర్, విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

### పార్టీ నాయకులతో ఎమ్మెల్సీ భేటీ



నెల్లూరు(బారకాసు) : నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని 54వ డివిజన్‌కు చెందిన పార్టీ నేత అస్లాం ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలపై చర్చించారు. పార్టీకి ప్రజల్లో అపూర్వ స్పందన లభిస్తోందని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు సలాం, మున్నా బాయ్, బాషా పాల్గొన్నారు.

### దారికాచి కత్తులతో దాడి

- వ్యక్తికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్) : పాతకక్షల నేపథ్యంలో దారికాచి ఓ వ్యక్తిపై కత్తులతో దాడిచేశారు. తీవ్రగాయాలపాలైన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోటమిట్టకు చెందిన సుల్తాన్ ఎద్దుల బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ఎడ్లను పార్లుకట్ట వద్ద కట్టేస్తాడు. ఈ క్రమంలో జెండావీధికి చెందిన అమీన్, టైలర్స్‌కాలనీకి చెందిన అల్లూతో సుల్తాన్‌కు పాతగొడవలున్నాయి. తరచూ వారి మధ్య ఘర్షణలు జరుగుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి సుల్తాన్ ఎడ్ల వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో అమీన్, అల్లూ మరో ముగ్గురితో కలిసి అడ్డుకున్నారు. కత్తులు, కర్రలతో విచక్షణా రహితంగా దాడిచేసి పరారయ్యారు. తీవ్రగాయాలపాలైన సుల్తాన్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు బాధితుడు సంతపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. నిందితులపై ఇన్‌స్పెక్టర్ దశరథరామయ్య హత్యాయత్నం కేసు నమోదు చేసి వారి కోసం గాలిస్తున్నారు.

### బకాయిలను చెల్లించాలి

నెల్లూరు (టౌన్) : ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ గౌరవాధ్యక్షుడు రాజమనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.25 వేల కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. 12వ పీఆర్సీ కమిటీ వేయాలని, కమిటీ నివేదిక వచ్చేలోపు 30 శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు. సంస్కరణల పేరుతో పాఠశాలలను మూసివేయడం తగదని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. క్లస్టర్ మీటింగ్‌లను పాత విధానంలోనే నిర్వహించాలన్నారు.

## మాతృభాషపై పట్టు సాధించాలి


మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో..


విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నెల్లూరు (టౌన్) : ప్రాథమిక దశ నుంచే మాతృభాషపై పట్టు సాధించాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు పద్యాలు, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాషను ప్రేమతో చదవడం, రాయడం నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల వసతులపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుపాల్, మురళీధర్, ఉపాధ్యాయులు కిరణ్, హరీష్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు పద్య పోటీలు**

మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వెంకటేశ్వర విద్యాలయంలో బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్య పోటీలను గురువారం నిర్వహించారు. అలాగే వక్తృత్వ పోటీలు జరిగాయి. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, స్కూల్ కరెస్పాండెంట్ శివకుమార్, సుబ్బమ్మ, నాగేశ్వరమ్మ, సుందరి, నాగరాజు, సులోచన, హర్షవర్ధిని, లత, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### డీఎస్పీని కలిసిన అకాడమి డైరెక్టర్


డీఎస్పీకి పూలమొక్కను అందజేస్తున్న వంశీకృష్ణ

నెల్లూరు(క్రైమ్) : నగర డీఎస్పీ పి.సింధుప్రియను ఆమె కార్యాలయంలో మైండ్స్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ మొగిలి వంశీకృష్ణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

### బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరిస్తాం

నెల్లూరురూరల్ : బీఎస్ఎన్ఎల్ సేవలను జిల్లాలో మరింత విస్తరిస్తామని నెల్లూరు ఎంపీ, టెలికామ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు రెండు లక్షల వినియోగదారులు ఉన్నారని, 310 4జీ టవర్లను వినియోగంలోకి తెచ్చామన్నారు. పీజీఎం అమరేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### రెప్కో బ్యాంక్‌లో స్పెషల్ డిపాజిట్ పథకాలు

నెల్లూరు(బృందావనం): భారత ప్రభుత్వ సంస్థ 'రెప్కో బ్యాంక్' కస్టమర్లకు స్పెషల్ డిపాజిట్ పథకాలను అందుబాటులోకి తెచ్చిందని నెల్లూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఆర్.రాహుల్ తెలిపారు. బృందావనంలోని గోటూరివారి వీధిలో ఉన్న రెప్కో బ్యాంక్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ రెప్కో బ్యాంక్ తన కస్టమర్ సభ్యులకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేటు అందిస్తోందన్నారు. సీనియర్ సిటిజన్లకు 8.75 శాతం, జనరల్‌కు 8.25 శాతం వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### యువతకు ఉపాధి కల్పించాలి


మాట్లాడుతున్న మున్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా డిమాండ్ చేశారు. నగరంలోని సంతపేటలో ఉన్న సీపీఐ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నైపుణ్యం కలిగిన యువతకు శిక్షణ ఇప్పించి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలని, వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించి నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు గౌస్‌బాషా, మధు, నాయకులు బదుల్లా, సాబ్‌జాన్ పాల్గొన్నారు.

### మహిళలు స్వశక్తితో ఎదగాలి


మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

నెల్లూరు(బారకాసు) : మహిళలు ఎవరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని మెప్మా పీడీ రాధమ్మ తెలిపారు. హరనాథపురంలో బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బ్యూటీషియన్‌లకు మంచి డిమాండ్ ఉందని, శిక్షణను పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు.

### 'వ్యక్తిత్వం-సాహిత్యం'పై సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో శనివారం సాయంత్రం 6.30 గంటలకు తెనాలి రామలింగ కవి 'వ్యక్తిత్వం-సాహిత్యం' అనే అంశంపై సమావేశం జరుగనుందని చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వాహకులు డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేషగిరీశం గురువారం తెలిపారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### మద్దతు ధర కల్పించేలా చర్యలు


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరురూరల్ : రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ కార్తీక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, సివిల్ సప్లయిస్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం ధాన్యం కొనుగోలు దళారులు, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రైతులకు నష్టం రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## శిశు మరణాల నివారణకు కృషి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్) : శిశు మరణాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత తెలిపారు. నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శిశు మరణాల సబ్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో జిల్లాలో తొమ్మిది శిశుమరణాలకు గల కారణాలు, లోపాల గురించి వైద్యులను ప్రశ్నించారు. శిశుమరణాలు జరగకుండా ఉండాలంటే గర్భం దాల్చిన ప్రతి మహిళను ఏఎన్ఎంలు గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. అప్పటి నుంచే గర్భిణుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి అన్నిరకాల రక్తపరీక్షలు, స్కానింగ్ పరీక్షలు చేయిస్తూ ఉండాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారి పట్ల మరింత జాగ్రత్త వహించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీఐఓ ఉమామహేశ్వరి, ఎఫ్‌పీసీ ప్రాజెక్టు అధికారి డాక్టర్ దయాకర్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు బ్రిజిత, రజని, జీజీహెచ్ చిన్నపిల్లల డాక్టర్ గ్రేస్‌ఎస్తేర్, శ్రావణ్‌కుమార్, డెమో అధికారి కనకరత్నం, ఎస్ఓ సహన తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత సమయానికి హాజరుకావాలి


సూచనలు చేస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : చెత్త సేకరణ వాహన డ్రైవర్లు క్రమశిక్షణ పాటించి, నిర్దేశించిన సమయానికి విధులకు హాజరుకావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ స్థానిక టీబీ ఆస్పత్రి వెహికల్ షెడ్డును ఆయన గురువారం తనిఖీ చేశారు. డ్రైవర్లు నిర్దేశించిన సమయానికి వాహన షెడ్డుకు వచ్చి హాజరు వేయాలని సూచించారు. బృందంగా ఫొటో తీసి ప్రతిరోజు తనకు పంపించాలని ఆదేశించారు. ఉదయం 6 నుంచి వారికి కేటాయించిన డివిజన్లలో హాజరు కావాలన్నారు. విధుల్లో అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో వెహికల్ ఇన్‌చార్జి రఘురాం, శానిటేషన్ సూపర్‌వైజర్ నరసింహారావు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ధర్నాలు.. ఆందోళనలు

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా నగరంలోని పలు ప్రాంతాల్లో వామపక్ష, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు. అంతే కాకుండా పలు సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు జరిపారు.**

### తాగునీటి సమస్యను తీర్చండి


ఎన్ఎంసీ కార్యాలయం ఎదుట..

నెల్లూరు(బారకాసు) : 23వ డివిజన్ సుందరయ్యనగర్ ఏ, బీ, ఈ బ్లాకులు, మౌర్యనగర్, శిరోమణినగర్, ఆటోవర్కర్స్ కాలనీ, చలపతినగర్ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను తీర్చాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఒంగోలు సుధీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎన్ఎంసీ కార్యాలయం ఎదుట స్థానిక ప్రజలతో నిరసన తెలిపారు. అనంతరం మేయర్ స్రవంతిని, ఎన్ఎంసీ మేనేజర్‌లను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు.

### పథకాల అమలుకు..

నెల్లూరు (టౌన్) : అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేయడంతో పాటు జీఓ నంబర్-77ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక వీఆర్సీ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు షారూఖ్, ఆశీర్వాదం, మస్తాన్, నవీన్, తేజ, హర్ష, లోకేష్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

### బడ్జెట్‌కు వ్యతిరేకంగా..


వామపక్ష నేతల ఆందోళన

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో నగరంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీసెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత రాంబాబు మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు ప్యాకేజీ ఇవ్వలేదని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. వామపక్ష నేతలు నరసింహులు, కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు, ఆంజనేయులు, ప్రసాద్, మాలకొండయ్య, నజీర్, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.